# మన(సు)లో మాట

అందరూ ఆయురారోగ్యైశ్వర్యవిద్య ఆనందముతో నూతన సంవత్సరము 2009 మరియు సంక్రాంతి శుభప్రదమవ్వాలని సంఘమిత్ర శుభాకాంక్షలను తెలియజేస్తోంది. చాలా మంది పాఠకులవద్దనుండి నూతన సంవత్సర శుభాకాంక్షలు అందాయి. వారి అభిమానమునకు కృతజ్ఞతలు.

చాలామంది పాఠకులు పత్రిక ముఖచిత్రము బాగుందని, జనపథం - జనపదం, ఆచారములు - అంతరార్థములు, సామెతకథలు, సమస్యల'తోరణం', చరిత్రకెక్కిన చరితార్థులు మొదలైన అంశములు ఆసక్తిని కలిగించే విధముగా ఉన్నాయని తెలియజేసారు. సంతోషం! ఉగాది సంచిక నుండి 'మేథామాత్రికలు' తిరిగి ప్రారంభిస్తున్నాము.

వేదగణిత పద్ధతులను నేర్చుకోడానికి ఆసక్తిని తెలియజేస్తూ, అమెరికా సంయుక్తరాష్ట్రములలోని (US లోని) చాలా రాష్ట్రములనుండి ఫోన్‌కాల్స్ రావడము విశేషము. కాని, 2008వ సంవత్సరములో కాలపరిమితి కారణముగ ఈ కార్యక్రమములు నిర్వహించలేక పోయాము. ఈ సంవత్సరములో వేదగణిత సూత్రములను నలుగురితో పంచుకోవాలని, దానికోసం తగిన చర్యలు తీసికొనవలెనని సంఘమిత్ర ప్రయత్నిస్తున్నది. ఈ క్రొత్త సంవత్సరములలో చాలామంది ఏవేవో చెయ్యాలని తీర్మానించుకొని ఉంటారు. మీ సదాశయములన్ని నిర్విఘ్నముగా కొనసాగవలెనని సంఘమిత్ర ఆశిస్తున్నది.

సంఘమిత్ర ఎక్కువగా ధ్యానము మరియు శాంతియుతమైన జీవనమునకు సంబంధించిన విషయములపై దృష్టిని నిలపాలని ఆలోచిస్తున్నది. ప్రపంచములో అనేక దేశములు పొరుగు దేశములపై యుద్ధమును ప్రకటిస్తున్నాయి. అహింస శాంతిని కబళిస్తున్నది. అత్యాశతో అత్యధిక శాతం జనులు ధనార్జనలో పడి, కనీస మానవతా విలువలను వదలిపెడుతున్నారు. ధనము,జ్ఞానము, సంతోషము మొదలైన విషయములను పొరుగువారితో పంచుకోవడము; ఎదుటివారియందు శ్రద్ధ వహించడము అనేవి సినిమాలకి, కథలకి మాత్రమే పరిమితమౌతున్నాయి. ప్రతి పౌరుడు వాని వద్ద కలిగిన అధికమైన తినుబండారములను, బట్టలను మరియు కనీస అవసర వస్తువులను పొరుగువారితో పంచుకొనే రోజు రావాలి. మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధి అన్నట్లు "మనము ప్రపంచములో చూడ్దామనుకున్న మార్పు మనమే కావాలి". ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడకుండా ఈ దిశలో ఒక అడుగు వేసి చూద్దామా!

మళ్ళీ ఉగాది సంచికలో కలుద్దామా! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.